క్లుప్తంగా

పేదలకు అన్నదానం



తెనాలిరూరల్: సినీ దర్శకుడు దిలీప్‌రాజా తన జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు నూతన వస్త్రాలు అందజేసి వారితో కలిసి భోజనం చేశారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో కాల్వ కట్ట వెంబడి కొంతమంది నిరుపేదలు నివసిస్తున్నారు. తన జన్మదినం సందర్భంగా బుధవారం అక్కడకు వెళ్లిన ఆయన వారికి వస్త్రాలు ఇవ్వడంతో పాటు ఆహార పొట్లాలు అందజేసి వారితో కలిసి భోజనం చేశారు.

తెనాలిలో చిరుజల్లులు



తెనాలిఅర్బన్: తెనాలిలో బుధవారం సాయంత్రం చిరు జల్లులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో జనం అల్లాడారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి చిరుగాలులు వీచాయి. అనంతరం చిరు జల్లులతో కూడిన వర్షం కొద్దిసేపు పడింది. దీంతో ప్రజలు కొంత సేదతీరారు.

బాల సాహిత్య పుస్తకావిష్కరణ



తెనాలిఅర్బన్: తెలంగాణ సారస్వత పరిషత్ వారు రూపొందించిన 'బాల సారస్వతం' పిల్లల కథల పుస్తకాన్ని బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలలో బుధవారం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు చెందిన రచయితలు పంపిన 117 కథలతో సంస్థ వారు అయిదు పుస్తకాలు ముద్రించినట్లు తెలిపారు. తెనాలికి చెందిన బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీం జానీ రూపొందించిన నాలుగు గుండిగలు కథ కూడా పుస్తకంలో ఉందన్నారు. అనంతరం హకీం జానీని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి పావని, ఏ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఇండియా కూటమికి మద్దతివ్వాలి



తెనాలిరూరల్: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు స్వాగతించారని తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ చంద్ర సాంబశివుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధిక మెజార్టీ తో గెలుపొందిన చంద్రబాబు నాయుడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమికి మద్దు తెలిపితే ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదాతో పాటు అనేక రకాలైన వసతులు చేకూరతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి టౌన్ ప్రెసిడెంట్ పొన్నూరు నాగ సూర్య శశిధరరావు, తెనాలి మండల అధ్యక్షుడు కర్లపూడి బుల్లియ్య, ద్వారకా శ్రీనివాస్, నక్క అమ్మకమ్మ, మాధవరావు, పి.శివకుమార్, బీమా రమేష్, టి శివనారాయణ, వై శంకరరావు, షేక్ మాబు, కే కోటేశ్వరరావు, సీహెచ్ అయ్యప్ప, ఎస్.సుబ్బారావు, రామ్, బి శ్రీను, ఎన్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయం

ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు

గుంటూరు మెడికల్: ఎన్నికల నిర్వహణలో ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయమని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. ఏపీ ఎన్జీవో హోంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నారా చంద్రబాబునాయుడుకు ఉద్యోగుల పక్షాన అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఉద్యోగులు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, సాంకేతిక అంశాల్లో సహాయ సహకారాలు అందించిన ఎన్నికల కమిషన్, జిల్లా యంత్రాంగానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కరోనా సమయంలో ఉద్యోగులు ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వం ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకొని సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా సంయుక్త కార్యదర్శి కురాకుల శ్రీనివాసరావు, ఏ.శ్యామ్ సుందర్ శ్రీనివాస్, గుంటూరు నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్. సూరి, కార్యదర్శి సీహెచ్. కల్యాణ్ కుమార్, ప్రత్తిపాడు తాలూకా అధ్యక్షుడు సీహెచ్. అనిల్ కుమార్, సునీల్ కుమార్, వేణుగోపాల్, ఇస్సాకు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు... మంచి రోజులొస్తాయి..!

మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



తెనాలిఅర్బన్: అధైర్య పడొద్దు.. మనకీ మంచి రోజులు వస్తాయని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వైఎస్సార్ సీపీ శ్రేణులకు భరోసా కల్పించారు. అయితానగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో ఓటమి చెందడాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జీర్ణించుకోలేక అవేదన చెందుతున్నారని అన్నారు. గెలుపు, ఓటములు సహజమని పార్టీ అధినేత వైఎస్ జగన్ చెప్పిన విధంగా అందరూ ప్రజల పక్షాన నిలిచేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. తెనాలి నియోజకవర్గంలో 76 వేల మంది ఓటర్లు వైఎస్సార్ సీపీ కి ఓట్లు వేశారని చెప్పారు. వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా పని చేసిన అయిదు సంవత్సరాలలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కూడ ఇచ్చినట్లు చెప్పారు. ఓటమికి కారణాలు విశ్లేషిస్తామన్నారు. ఎక్కడ ఇబ్బందులు ఎదురయ్యాయో తెలుసుకుని వాటిని రానున్న రోజుల్లో అధిగమిస్తామన్నారు. వైఎస్ జగన్ నాయకత్వంలో ప్రజా క్షేత్రంలో ఉంటూ వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామన్నారు. తాను స్థానికుడనని, అందరికీ అందుబాటులో ఉంటూ వారికి ఏకష్టం వచ్చిన ముందుంటాననే భరోసా ఇచ్చారు. సమావేశంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే ప్రగతి



కొల్లిపర హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న సాల్మన్‌రాజు, ఝాన్సీలత

కొల్లిపర: ప్రతి ఒక్కరూ వారి జీవితంలో వచ్చే పుట్టిన రోజున క్రమం తప్పకుండా ఒక మొక్క నాటాలని తద్వారా సమాజానికి, మానవాళికి మంచి జరుగుతుందని ఎంఈవోలు ఎం. సాల్మన్‌రాజు, ఝాన్సీలత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు పాల్గొని విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు పెంచటం వలన సకాలంలో వర్షాలు పడతాయన్నారు. గాలి, నీరు కలుషితం కాకుండా రక్షించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఈదా సాంబిరెడ్డి, ఎంఐఎస్ రమేష్, సీఆర్‌పీలు పిడపర్తి రమేష్‌బాబు, వి.మురళి, బి.అలేఖ్య, డి.స్వరూపరాణి, వై.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో జయంతి బాబు, ఉపాధ్యాయులు

తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు అంతా కృషి చేయాలని తెనాలి మండల విద్యాధికారి వి జయంతి బాబు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ ఆవశ్యకతను విద్యార్థి దశలోనే తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేసే ఏకో క్లబ్‌లను పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన జీవితాన్ని జీవించాలని సూచించారు. ఈ నెల 12 నుంచి 19 వరకు ప్రతి రోజు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



తెనాలి కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయవాదులు

తెనాలిరూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో న్యాయవాదులు బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ భావి తరాలకు ఆరోగ్యకర వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, కిషోర్, పుణ్యవతి, సుధాకర్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు, పొన్నం విజయ్‌కుమార్, గుమ్మడి రవిరాజు, మధిర సురేష్, పెదపూడి భూషణం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి



ఫిరంగిపురం: చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని వైద్యాధికారి పి.ఎస్తేరురాణి తల్లలకు సూచించారు. మండలంలోని రేపూడిలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 212 మందికి పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈసందర్భంగా చిన్నారుల తల్లులకు టీకాలు వేయించడం వలన కలిగే ఫలితాలు గురించి వివరించారు. పుట్టిన వెంటనే బీసీజీ, హెపటైటిస్ బీ, విటమిన్ కే, పోలియె చుక్కలు వంటివి వేయించాలని కోరారు. తరువాత పెంటావైలెంట్, పీసీవీ, ఐపీవీ, రోటా వైరస్ టీకాలు వేయించాలని చెప్పారు.

ఈవీఎంలు గోడౌన్‌కు తరలింపు

ఫిరంగిపురం: ఎన్నికల అనంతరం ఈవీఎం యంత్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వాటిని మండలంలోని రేపూడి గ్రామంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని గోడౌన్‌కు తరలించారు. కాగా అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన రెవెన్యూ సిబ్బందితో వాటిని భద్రంగా గోడౌన్‌లో భద్రపరిచినట్లు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తెలిపారు. భద్రపరుస్తున్న తీరును తహసీల్దార్ రాఘవేంద్రరావు, డెప్యూటీ తహసీల్దార్ రాజారమేష్ పర్యవేక్షించారు.

రోగులకు సంచుల పంపిణీ



గుంటూరు మెడికల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం జీజీహెచ్ నాట్కో సెంటర్‌లో 300 మంది రోగులకు కీర్తన ట్రస్ట్ అధ్యక్షురాలు మేరీగ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్లు ఆశా సజని, గంగమ్మ, కిరణ్మయి పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పేరు మార్పు

ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియం బోర్డు ఏర్పాటు చేసిన టీడీపీ కార్యకర్తలు



ఎన్టీఆర్ స్టేడియం బోర్డు పెట్టిన టీడీపీ కార్యకర్తలు

తెనాలిరూరల్: పట్టణ చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) సబ్ సెంటర్ స్టేడియంకు ఎన్టీఆర్ స్టేడియం అంటూ టీడీపీ కార్యకర్తలు బుధవారం సాయంత్రం బోర్డు పెట్టారు. ఇండోర్ స్టేడియం పేరును అన్నాబత్తుని సత్యనారాయణ స్టేడియంగా పేరు మారుస్తూ రెండేళ్ల క్రితం మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం ఆమోదం పొందింది. అప్పటి నుంచి స్టేడియంలో ఏ కార్యక్రమం జరిగినా ఇదే పేరును వినియోగిస్తున్నారు. తాజాగా ఎన్నికల్లో టీడీపీ గెలుపొందడంతో కొందరు టీడీపీ కార్యకర్తలు శాప్ బోర్డును తొలగించి ఎన్టీఆర్ స్టేడియం అంటూ బోర్డు పెట్టారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే బోర్డు మార్చటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బాలికా విద్యకు అప్‘గ్రేడ్’

- ఆదర్శంగా నిలుస్తున్న వెంగళరావునగర్ బాలికోన్నత ఇంగ్లిష్ మీడియం పాఠశాల
- గత ఏడాది ఎలిమెంటరీ స్కూలు నుంచి అప్‌గ్రేడ్
- పోటీ పరీక్షలకు ప్రత్యేక తర్ఫీదు
- డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థినులకు బోధన



వెంగళరావు నగర్‌లోని నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాల

నెహ్రూనగర్: విద్యా రంగంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విప్లవాత్మకమైన మార్పులతో గుంటూరు నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు అత్యున్నత ప్రమాణాలతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలుస్తున్నాయి. అద్భుతమైన ఫలితాల్ని సాధిస్తున్నాయి. విద్యార్థుల్ని మెరికల్లా తీర్చిదిద్దుతున్నాయి. తూర్పు నియోజకవర్గం పరిధిలోని వెంగళరావు నగర్ 5/3లో ఉన్న గుంటూరు నగరపాలక సంస్థ ఎలిమెంటరీ స్కూల్ గత ఏడాది జూన్ 28న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలగా(1 నుంచి 10వ తరగతి వరకు) అప్‌గ్రేడ్ అయింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆడపిల్లల్ని మాత్రమే చేర్చుకునేందుకు హెచ్‌ఎం, విద్యా కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. తూర్పు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తున్నారు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

నగర పరిధిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ కలిగిన ఏకైక పాఠశాలగా వెంగళరావునగర్ పాఠశాలను చెప్పుకోవచ్చు. నిత్యం సీసీ కెమెరాల పర్యవేక్షణలో నడుస్తుంది. ఉదయం 9 గంటలకు గల్లా గేట్లు క్లోజ్ చేస్తే ఇక సాయంత్రం 4 గంటలకే తెరుచుకునేది. మధ్యలో ఎటువంటి పర్మిషన్స్ ఉండవు. స్కూల్‌లోనే విద్యార్థినులకు రోజుకొక మెనూతో రుచికరమైన భోజనం అందిస్తున్నారు. ప్రభుత్వం రూ.20వేల విలువైన ఉచిత టెక్స్ట్‌బుక్స్, నోట్స్‌లు, వర్క్ బుక్స్, స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాం, షూస్, సాక్స్, బెల్టు ఉచితంగా అందజేస్తోంది.



బోధన కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ సెటప్

విద్యార్థినులపై వ్యక్తిగత శ్రద్ధ

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా డిజిటల్ పద్ధతిలో బోధన చేస్తున్నారు. అన్ని రాష్ట్ర, జాతీయ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జాతీయ, సంప్రదాయ పండుగల రోజుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థినుల్లో మానసిక ఉల్లాసం కోసం ఆటలు, ప్రతి శనివారం నో బ్యాగ్ డే, మాస్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. చదువులో వెనకబడిన వారిపై మరింత దృష్టి సారిస్తున్నారు.

18 కాలనీలకు ఒక్కటే బాలికోన్నత పాఠశాల



బొంగరాలబీడు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు, నెహ్రూనగర్ నుంచి అమరావతి రోడ్డు వరకు సుమారు 18 కాలనీలకు మధ్యలో వెంగళరావునగర్ బాలికోన్నత పాఠశాల ఉండటం విశేషం. సీసీ కెమెరాల నిర్వహణతో పాటు ఆర్వో ప్లాంట్ ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నాం. ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి పాఠశాలకు సంబంధించిన సమాచారాల్ని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం.

–పి. రమేష్, హెడ్ మాస్టర్, వెంగళరావునగర్ బాలికోన్నత పాఠశాల

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు



వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ముఖ్యంగా ఎలిమెంటరీ స్కూల్‌గా ఉన్న వెంగళరావునగర్ పాఠశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించి గత సంవత్సరం అప్‌గ్రేడ్ చేశారు. ఈ ప్రాంతంలో బాలికోన్నత పాఠశాల ఉండటం ఆడపిల్లల తల్లిదండ్రులకు భరోసా కలుగుతుంది.

– చందు పవన్, పాఠశాల విద్యా కమిటీ ౘైర్మన్

తెనాలి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతాం

ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్



ఎమ్మెల్యే మనోహర్‌ను సన్మానిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

తెనాలిఅర్బన్: తెనాలి నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతానని ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమికి ప్రజలు మద్దతు పలికి ఎన్నికలలో అఖండ మెజార్టీని అందించారని అన్నారు. తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వ్యతిరేక ఓటును చీలనీయబోమని ఇచ్చిన పిలుపును అంతా గౌరవించి మద్దతు పలికారన్నారు. గతంలో ఎన్నడూ లేనంత మెజార్టీని తెనాలి నియోజకవర్గ ప్రజలు తనకు అందించారని అన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించడమే కాక వెన్నంటి ఉండి నడిపించిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలను తప్పక అమలు చేస్తామన్నారు. అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, ఉద్యోగ సంఘ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. సమావేశంలో జనసేన నాయకులు హరిదాసు గౌరీశంకర్, దొడ్డక ఆదినారాయణ, యశ్వంత్, లీల తదితరులు పాల్గొన్నారు.

నూతక్కి అబ్రహాం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



కవుల చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న సభ్యులు

తెనాలిరూరల్: మధుర కవి నూతక్కి అబ్రహాం విగ్రహాన్ని తెనాలి బండ్‌పై ఏర్పాటు చేయాలని మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం(మాస్) సభ్యులు కోరారు. 'మాస్' రాష్ట్ర నాయకులు కూచిపూడి మోహన్ మాదిగ ఆధ్వర్యంలో రూరల్ మండలం కొలకలూరు గ్రామ సెంటర్ వద్ద గుర్రం జాషువా ప్రియ శిష్యుడు నూతక్కి అబ్రహాం 25వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ మాట్లాడుతూ గుర్రం జాషువా గబ్బిలం రచిస్తే శిష్యుడు అబ్రహాం మత్కుణం మీద రాసిన పద్యం మరువలేనిదని అన్నారు. న్యాయవాది సుద్దపల్లి మురళీధర్ మాట్లాడుతూ తెనాలి బండ్‌పై అబ్రహాం విగ్రహాన్ని ఏర్పాటు చేసే విధంగా ఎమ్మెల్యే మనోహర్ చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సుద్దపల్లి అంబేడ్కర్, భవనాసి హేబెల్, మోదుకూరి దావీదు, ఉన్నం జానుబాబు, ఉన్నం చిన్నజాను, ఉన్నం సన్నీ, ఉన్నం గోపి, ఉన్నం ఇమ్మానుయేలు, జర్నలిస్ట్ నూతక్కి ఆచారి, నూతక్కి స్వరాజ్ వర్మ పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జన్మదిన వేడుకలు



ఆంజనేయునికి లడ్డూలతో అర్చన

తెనాలి: స్థానిక షరాఫ్ బజారులోని శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీ హనుమత్ గాయత్రీ హోమం, 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, సాయత్రం స్వామి వారికి 1108 లడ్డూల అర్చన చేశారు. పండితులు వైదిక క్రతువును ఆగమోక్తంగా నిర్వహించారు. శ్రీ హనుమాన్ చాలీసా పారాయణలో మహిళా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త ములుకుట్ల విశ్వనాథ శర్మ సుందరకాండ ప్రవచనం చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని ఆంజనేయ స్వామికి ప్రదక్షిణాలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకల్లో భాగంగా జూన్ 11వ తేదీ వరకు వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, 16వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిరోజు 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, స్వామి వారికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని కోరారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవాసమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, ఉప్పల వరదరాజులు, మదుపల్లి చంద్రశేఖర్, ఆర్.సురేష్, ఎం వెంకటేష్, బి.లీలాప్రసాద్, గోలి సోమశేఖర్, సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటుతున్న అధికారులు

పెదకాకాని: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీసీ జి.విజయలక్ష్మి అన్నారు. పెదకాకాని మండలం, ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాల్లో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సమగ్ర శిక్షణ అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్క నాటి పెంచాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈనెల 12వ తేదీ నుంచి 19 వరకూ జరిగే పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యవరణ పరిరక్షణ, మొక్కలు పెంచడం, ప్లాస్టిక్ వాడకం ద్వారా కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించాలన్నారు. తొలుత పర్యావరణ పరిరక్షణపై అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు, జిల్లా సమగ్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి ప్రసాద్, సీఎంఓ ఐ.సుజాత, మండల విద్యాశాకాధికారులు డి.బలిరాం, వి.శంకరరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాస శివరాత్రి ప్రత్యేక పూజలు

చేబ్రోలు: వసంత రుతువులోని వైశాఖ మాస బహుళ చతుర్దశి మాస శివరాత్రి సందర్భంగా ఖ్యాతి గాంచిన చేబ్రోలులోని నాగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజత నాగాభరణంలో ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.పూజలు, అలంకరణను అర్చకులు నిర్వహించారు.